# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ భారత స్వాతంత్ర్య పోరాటంలో దృఢమైన, స్ఫూర్తిదాయకమైన యోధుడు నేతాజీ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ సౌరశక్తితో విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వాహనాలకు వినియోగిస్తే శిలాజ ఇంధానలపై ఖర్చు తగ్గుతుందని, కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

❖ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత సైన్యం తన బలాన్ని ప్రదర్శించేందుకు సన్నద్ధమైందని మేజర్ జనరల్ సుమిత్ మెహతా తెలిపారు.

❖ కుంభమేళా సందర్భంగా ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత స్వాతంత్ర్య పోరాటంలో దృఢమైన, స్ఫూర్తిదాయకమైన యోధుడు నేతాజీ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ... లక్షలాది మంది భారతీయులను స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా నేతాజీ ప్రేరేపించారన్నారు. ఆయన దృఢ సంకల్పం, ఆజాద్ హింద్ ఫౌజ్ ధైర్యవంతమైన నాయకత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. అలాగే... ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సురేంద్ర సాయి జయంతి సందర్భంగా రాష్ట్రపతి ఆయనకు నివాళులర్పించారు. ఆయన... పరాయి పాలనకు వ్యతిరేకంగా పోరాడి ధైర్యసాహసాలు, శౌర్యం, త్యాగానికి ఉదాహరణగా నిలిచారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపిన అంకితభావం, ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు ఆయన అసాధారణ దృక్పథానికి, పరాక్రమానికి నిదర్శనమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. దేశాన్ని పరాయి పాలన నుండి విముక్తి చేయడంలో నేతాజీ శౌర్యం, జాతీయవాద భావజాలం అసంఖ్యాక భారతీయులకు స్ఫూర్తినిస్తూనే ఉందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యుత్ వాహనాల వినయోగం ద్వారా శిలాజ ఇంధనాలపై ఖర్చు తగ్గుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంతరి నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడకు హాజరైన విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అందించిన వెయ్యి 200 బస్సులు ఢిల్లీలో నడుస్తున్నాయని, భవిష్యత్ లో మరిన్ని బస్సులను ప్రవేశపెడతామని చెప్పారు. "ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన" గురించి వివరిస్తూ... సౌరశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఈ విద్యుత్‌ను వాహనాలకు వినియోగిస్తే కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థులు ఇంటివద్దే విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ప్రభుత్వానికి విక్రయించవచ్చని ప్రధానమంత్రి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత సైన్యం తన బలాన్ని ప్రదర్శించేందుకు సన్నద్ధమైందని మేజర్ జనరల్ సుమిత్ మెహతా తెలిపారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ... మౌంటెడ్ కాలమ్, 8 మెకనైజ్డ్ కాలమ్‌లు, అలాగే 8 మార్చింగ్ కాంటింజెంట్ లు భారత సైన్యానికి ప్రాతినిధ్యం వహిస్తాయని చెప్పారు. ఈసారి యుద్ధభూమి నిఘా వ్యవస్థ, ప్రళయ్ ఆయుధ వ్యవస్థకు సంబంధించి డిఆర్‌డిఓ రూపొందించిన చిత్రణ 90 నిమిషాల పాటు జరిగే కవాతులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కవాతులో భాగంగా భీష్మ T-90 ట్యాంక్, నాగ్ మిస్సైల్ సిస్టమ్, బజరంగ్ లైట్ స్పెషలిస్ట్ వాహనం, నందిఘోష్ క్విక్ రియాక్షన్ ఫోర్స్ వెహికల్, బ్రహ్మోస్, అగ్నిబాణ్, పినాక, ఆకాష్ ఆయుధ వ్యవస్థలు మన దేశ సైనిక శక్తిని ప్రదర్శిస్తాయని పేర్కొన్నారు.

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కుంభమేళా సందర్భంగా ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈరోజు ఒక ప్రకటన విడుదల చేస్తూ... మకర సంక్రాంతి రోజున దాదాపు 3.5 కోట్ల మంది, పౌష్ పూర్ణిమ వేడుకలో 1.7 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారని పేర్కొంది. పండుగల సమయాల్లో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై పరిమితులు విధించినట్టు తెలిపింది. అలాగే... మౌని అమావాస్య సందర్భంగా కుంభమేళాకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కాగా... కుంభమేళా సందర్భంగా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన 12 లక్షల ఉద్యోగాలు కల్పించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అమెరికా దేశాల మధ్య సంబంధాలు బలీయమైనవని, రెండు దేశాలు పరస్పరం విశ్వాసాన్ని కలిగి ఉన్నాయని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. రెండు దేశాలు ప్రపంచ దేశాల క్షేమాన్ని కోరుకుంటాయని, అలాగే... ద్వైపాక్షిక ఒప్పందాల సమయంలో వారి జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యననిస్తాయని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈరోజు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలు తప్పనిసరిగా కృషి చేయాలన్నారు. నేతాజీ స్మృతి దేశాన్ని చైతన్యవంతం చేస్తూనే ఉందని, ఆయన ఊహించిన

భారతదేశాన్ని నిర్మించే దిశగా మనం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ధైర్యసాహసాలకు నేతాజీ ప్రతిరూపమని పేర్కొంటూ....

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు ఈరోజు ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్ నగర్ సెక్టార్ - 4లో ఉన్న ఆకాశవాణి, దూరదర్శన్ క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించి, మహాకుంభ్ 2025 కవరేజీ కోసం చేసిన ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మహాకుంభ్ 2025 కార్యక్రమ విశేషాలను ప్రసారం చేసేందుకు ప్రసార భారతి విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. మహాకుంభ్ కు సంబంధించి ఆసక్తికరమైన విషయాలను ప్రపంచానికి అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేయడం ద్వారా మహాకుంభ్... ఐక్యత సందేశాన్ని వ్యాప్తి చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (EPFO) గత సంవత్సరం నవంబర్‌లో 14 లక్షల 63 వేల మంది సభ్యులను చేర్చుకుందని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది. అక్టోబర్ 2024తో పోల్చితే నికర సభ్యుల సంఖ్యలో 9.07 శాతం పెరుగుదల నమోదయినట్టు వెల్లడించింది. పెరుగుతున్న ఉపాధి అవకాశాలు, ఉద్యోగుల ప్రయోజనాలపై అవగాహన పెరగడంతో పాటు EPFO చేపట్టిన అవుట్ రీచ్ కార్యక్రమాలు కూడా ఈ పెరుగుదలకు కారణమని పేర్కొంది. నవంబర్ 2024లో దాదాపు 2 లక్షల 40 వేల మంది కొత్త మహిళా సభ్యులు చేరారని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణ రాష్ట్రంలో మూడు పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు గాను ఆ రాష్ట్ర ప్రభుత్వం సన్ పెట్రోకెమికల్స్‌తో ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సందర్భంగా ఈ మేరకు ఎంఓయూపై సంతకాలు చేశారు. 45 వేల 500 కోట్ల రూపాయల అంచనా పెట్టుబడితో నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ఈ ప్రాజెక్టులు నెలకొల్పుతారని, నిర్మాణ దశలో 7 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అధికారులు వెల్లడించారు. అలాగే... JSW UAV లిమిటెడ్ సంస్థ... తెలంగాణాలో మానవరహిత వైమానిక వ్యవస్థల తయారీ కేంద్రాన్ని స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ సంస్థ ఈ ప్రాజెక్ట్‌లో సుమారు 800 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్ లో ఈరోజు కౌలాలంపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకను భారత జట్టు 60 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో భారత్ టోర్నీలో వరుసగా మూడవ విజయాన్ని నమోదు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ మహిళల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =